క్లుప్తంగా

స్పాస్టిక్ సెంటర్‌లో అన్నదానం



నెల్లూరు(బారకాసు): నగరంలోని మద్రాసు బస్టాండ్ సమీపంలో ఉన్న రెడ్‌క్రాస్ రక్తనిధి ప్రాంగణంలోని స్పాస్టిక్ సెంటర్‌లో చిరమణ బాలయ్య జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు సోమవారం అన్నదానం చేశారు. రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడు, మాజీ రంజీ క్రీడాకారుడు కోటారెడ్డి, బాలయ్య కుమారుడు పరమేశ్వర రావు, వాణి దంపతులు, వాసవీలత, మల్లికార్జునరావు, ప్రశాంత్, సెంటర్ ప్రిన్సిపల్ గురునాథం, ఏఆర్వీ క్లీనిక్ కన్వీనర్ ఇంకురెడ్డి, కార్యదర్శి మస్తానయ్య పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



నెల్లూరు (టౌన్): విద్యావికాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పొదలకూరురోడ్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మెరిట్ విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. 8,9,10 తరగతుల్లోని 32 మంది మెరిట్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేసినట్లు ట్రస్ట్ నిర్వాహకుడు కోటేశ్వరరావు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీసీసీబీ సీఈఓకు వినతి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకారం బ్యాంకు(డీసీసీబీ) సీఈఓ శంకర్‌బాబును ఆ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు సోమవారం కలిశారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ డీసీసీబీలో ఉద్యోగాలు చేసి విరమణ పొందిన వారు 2022 జూన్ నాటికి 144 మంది ఉన్నారని తెలిపారు. వారికి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.5 వేల పెన్షన్ అందేలా చూడాలని, ఆరోగ్యశ్రీ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ కార్యదర్శి కాంతారావు, కోశాధికారి సుధాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

కనుపూరుచెరువుకు సాగునీరివ్వాలని వినతి

నెల్లూరు(దర్గామిట్ట): కనుపూరు చెరువుకు సాగునీరు ఇవ్వాలని టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీ రోణంకి కూర్మనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని అన్ని చెరువులకు రెండో పంటకు సాగునీరు వదిలినా, కనుపూరు చెరువుకు మాత్రం ఇంకా వదలకుండా అక్రమంగా గ్రావెల్, మట్టిని తరలిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రెండు వేల ఎకరాల ఆయకట్టు కలిగిన కనుపూరు చెరువుకు వెంటనే రెండో పంటకు సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవం

నెల్లూరు(బృందావనం): గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్రపార్కులో ప్రపంచ సంగీత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో గాయకుడు కేసు శ్రీనివాసులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఘనంగా నివాళులర్పించారు. పలువురు సీనియర్ గాయకులు ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన గీతాలు పాడారు. ఈ సందర్భంగా పలువురు గాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయప్పను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెంచలరెడ్డి, ఎస్ మురళీమోహన్‌రావు, రాజశేఖర్, రఘురామిరెడ్డి,విశ్వేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

సాయిబాబా నగరోత్సవం



నెల్లూరు(బృందావనం): గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా గాంధీబొమ్మ సమీపంలోని షిర్డీసాయిబాబా మందిరంలో సోమవారం సాయినాథుడి నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయినాథుడు గంధర్వ వాహనంపై విశేషాలంకారంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. నగరోత్సవం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నగరోత్సవ ఏర్పాట్లను మందిర కమిటీ చైర్మన్ మన్నెం అమర్‌నాథ్‌రెడ్డి పర్యవేక్షించారు.

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై నిరసన



బుజబుజనెల్లూరులో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



నగరంలో పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న వలంటీర్లు

నెల్లూరు రూరల్/నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజా సేవ చేస్తున్న తమపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై వలంటీర్లు సోమవారం నిరసన తెలిపారు. నగర నియోజకవర్గంలోని వలంటీర్లు గాంధీబొమ్మ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం వీఆర్సీ కూడలిలో పవన్ కళ్యాణ్ బ్యానర్‌ను దహనం చేశారు. అలాగే రూరల్ నియోజకవర్గ పరిధిలోని బుజబుజనెల్లూరులో స్థానిక వలంటీర్లు పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని రకాల సేవలందిస్తున్న తమపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు కన్యకా పరమేశ్వరికి గోరింటాకు అలంకారం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ముక్కాల ద్వారకానాథ్

నెల్లూరు(బృందావనం): ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని స్టోన్‌హౌస్‌పేటలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి 250 నుంచి 300కేజీల గోరింటాకుతో మంగళవారం ప్రత్యేక అలంకారం నిర్వహించనున్నట్లు ఆ ఆలయ పాలక మండలి గౌరవాధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆలయ ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోరింటాకు అలంకారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు గోరింటాకు అలంకారంలో అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తారని చెప్పారు. అలాగే ఆషాడ మాసం శుక్రవారం సందర్భంగా ఈ నెల 14న అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులను కటాక్షించనున్నట్లు తెలిపారు. శాకంబరి అలంకారానికి ఉభయకర్తలుగా పాదర్తి బాలాజీ, తన్నీరు కిషోర్‌కుమార్, పైడా హేమంత్‌కుమార్, పబ్బిశెట్టి నందకిషోర్, పసుమర్తి ప్రసాద్, పసుమర్తి సతీష్, పసుమర్తి కుమార్ వ్యవహరించనున్నట్లు వివరించారు.

ఆగస్టు 6న సర్వసభ్య సమావేశం

వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని దాతల సహకారంతో అపురూపంగా నిర్మించుకున్నట్లు ద్వారకానాథ్ తెలిపారు. దేవస్థానం పునఃనిర్మాణం, ఆర్థిక వివరాలను వెల్లడించేందుకు ఆగస్టు 6న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని కోరారు. ఆలయ పాలకమండలి చైర్మన్ సుంకు మనోహర్, ఈఓ ఐతా రామచంద్రావు, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసులు, శ్రీరాంసురేష్, సరాబు సుబ్రహ్మణ్యం, సముద్రాల సత్యనారాయణ, పేర్ల సీతారామారావు, బైసాని జ్యోతిప్రసాద్, పాదర్తి బాలాజీ, పైడా హేమంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదును స్వీకరించిన విద్యుత్ అధికారులు సత్వరమే స్పందించి సమస్యను పరిష్కరించారు. వివరాలు..నెల్లూరు ఈస్ట్–1 విద్యుత్ సెక్షన్ పరిధిలోని మూడో మైలు ప్రాంతానికి చెందిన ఓ విద్యుత్ వినియోగదారుడు తన ఇంటికి రాత్రి వేళ లోఓల్టేజీ వస్తోందని 'జగనన్నకు చెబుతాం' కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదును స్వీకరించిన విద్యుత్ సిబ్బంది సింగిల్‌ఫేస్‌కు సరిపోయే సర్వీసు కనెక్షన్ తీసుకుని గృహ వినియోగం అధికంగా ఉండడంతో సమస్య తలెత్తినట్లు గుర్తించారు. సోమవారం నెల్లూరు టౌన్–2 డీఈఈ మధుసూదన్‌రెడ్డి, ఈస్ట్–1 ఏఈ విజయ్‌కుమార్ వినియోగదారుడి ఇంటికి వెళ్లి సిబ్బందితో ఫేస్ మార్పించి లోఓల్టేజీ సమస్యను పరిష్కరించారు.

వినతులను సత్వరమే పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): స్పందన, జగనన్నకు చెబుదాంకు వచ్చే వినతులను తక్షణమే నూరుశాతం పరిష్కరించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో భాగంగా సమస్యలపై ఫోన్ చేసిన నగర ప్రజలతో మాట్లాడారు. 14 ఫిర్యాదులు అందగా నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి నేరుగా 32 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అందే వినుతులను ఆదేరోజు పరిశీలించేలా నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సంపూర్ణంగా పరిష్కరించాలని సూచించారు. ప్రతివారం ఈ అంశంపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఏ ఒక్క అర్జీ పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థలోని పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డిది పెత్తందారి పాలన



మాట్లాడుతున్న జీవీ ప్రసాద్

నెల్లూరు (దర్గామిట్ట): రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిది పెత్తందారి పాలన అని రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి జీవీ ప్రసాద్ ఆరోపించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డివి చిలుక పలుకులు, చిల్లర మాటలు అని కోటంరెడ్డి విమర్శించారని, తమ నాయకుడివి చిల్లర చేష్టలు కావని, రాజకీయాలకు అతీతంగా పేదలకు సేవ చేయడమే ఆయన అభిమతమని పేర్కొన్నారు. జిల్లాలో చాలా మంది పెద్దలు రాజకీయంగా పలు ఉన్నత స్థానాలు అధిరోహించారన్నారు. కానీ శ్రీధర్‌రెడ్డి రూరల్ నియోజకవర్గంలో రివ్యూ మీటింగులు సైతం సోదరుడు గిరిధర్‌రెడ్డితో నిర్వహించడం ఏపాటిదన్నారు. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా శిలాఫలకాల్లో గిరిధర్‌రెడ్డి పేరు వేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రూరల్ పరిధిలో టోల్‌గేట్ ఏర్పాటు విషయమై ఎంపీ విజయసాయిరెడ్డితో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడిన మాటలు వాస్తవమన్నారు. టోల్‌గేట్ పనులు ప్రారంభమై పది రోజులైన ఎందుకు ఆపలేదని కోటంరెడ్డిని ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌తో లాలూచీ నడిచిందా.. ఒప్పందాలు కుదర లేదా అని అందరూ చర్చించుకుంటున్నారన్నారు. టోల్‌గేట్ పనుల నిలుపుదల కోసం ఎంపీ వేమిరెడ్డి, ఆదాల గట్టిగా కృషి చేస్తున్నారన్నారు. బారాషహీద్ దర్గా, రోడ్ల అభివృద్ధికి ఎంపీ ఆదాల చొరవతో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే కోటంరెడ్డి తన ఖాతాలో వేసుకోవడం హాస్యాస్పదమన్నారు.

ఏసీబీ తనిఖీలతో కలకలం

నెల్లూరు(బృందావనం): నగరంలోని రంగనాయకుల పేటలోని శ్రీదేవి,భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో సోమవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టడం ఆ శాఖ అధికారుల్లో కలకలం రేపింది. 2017 జూలై 15న అప్పటి ఆలయ ఈఓగా విధులు నిర్వహించిన పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి అవినీతి, అక్రమాలకు పాల్పడి ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. దాదాపు ఆరేళ్ల తరువాత జూలై మాసంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టడం విశేషం.

తీర్థకారి వివాదంతోనే..

ఏసీబీ తనిఖీలపై పలు ప్రచారాలు వినిపిస్తున్నాయి. కొందరు ఆలయ జమాఖర్చులకు సంబంధించి తనిఖీలు చేపడుతున్నారని చెబుతుండగా, మరికొందరు ఇరువురు అర్చకుల నడుమ తలెత్తిన 'తీర్థకారి' వివాదంపై ఫిర్యాదులు అందడంతో విచారణ చేస్తున్నారని చెబుతున్నారు. ఏసీబీ అధికారులు ఎవర్నీ లోపలికి అనుమతించకపోవడంతో ఎవరికి తోచిన రీతిలో వారు దాడులపై గుసగుసలు పోతున్నారు. ఆలయ వర్గాల నుంచి సేకరించిన సమాచారం మేరకు.. దేవస్థానం సంప్రదాయం ప్రకారం రంగనాథస్వామికి పూజలు నిర్వహించిన తరువాత తొలుత తీర్థం, శఠారిని అందజేసే తీర్థకారి గౌరవ మర్యాదలను ఆలయ వంశపారంపర్య అర్చకుల్లో ఒకరైన టీవీ నరసింహాచార్యులు అందుకుంటున్నారు. కాగా వంశపారంపర్యంగా తీర్థకారి అర్హత తనకే ఉందంటూ స్థానికేతరుడైన మరో అర్చకుడు పీవీ శ్రీరాం ఈఓ డీ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఐ శివకుమార్‌ఆచారిపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. వారు అందుకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలను అందజేయాలని శ్రీరామ్‌ను కోరినట్లు సమాచారం. ఈ వివాదం నేపథ్యంలో టీవీ నరసింహాచార్యులు రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తెచ్చుకోవడంతో ఆయన్నే తీర్థకారిగా పరిగణిస్తామని, దేవాదయ,ధర్మాదయశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు తీసుకొస్తేనే తీర్థకారిగా సమ్మతిస్తామని శ్రీరాంకు బదులిచ్చారని తెలిసింది. దీంతో దేవస్థానం వర్గాలపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేసిన శ్రీరాం దేవస్థానంలో అనేక అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని, తీర్థకారిగా తాను అర్హుడనైనప్పటికీ తనను గౌరవించడం లేదంటూ దేవాదయ శాఖ ఉన్నతాధికారులతో పాటు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారని సమాచారం. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారని తెలిసింది. దేవాదాయశాఖ అధికారులను దేవస్థానానికి పిలిపించి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

నేడు 17వ డివిజన్‌లో జగనన్న సురక్ష శిబిరం

నెల్లూరు(బారకాసు): రూరల్ నియోజకవర్గ పరిధిలోని 17వ డివిజన్‌కు సంబంధించి 'జగనన్న సురక్ష' శిబిరాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ అధికారులు తెలిపారు. 17/1,2,3 వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకుని అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పొందాలని కోరారు.

పేపర్ క్రాఫ్ట్ పోటీలకు ఆహ్వానం

నెల్లూరు (దర్గామిట్ట): ఆగస్ట్ 1న అంతర్జాతీయ కాగిత దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వ సమాచార–ప్రసార మంత్రిత్వ శాఖ, పేపర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీశ్రీ ఏజెన్సీస్, నెల్లూరు సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రోత్సహించే ఉద్దేశంతో పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నెల్లూరులోని అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులతో పేపర్ క్రాఫ్ట్‌లు తయారు చేయించి ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేసి ఈ నెల 20వ తేదీలోగా 94403 89999 నంబర్‌కు వాట్సప్‌లో పంపాలని కోరారు. ఈ నెలాఖరులో పాఠశాల స్థాయి విజేతల పేపర్ క్రాఫ్ట్‌లతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించి 20 మంది విజేతలను ఎంపిక చేస్తామన్నారు. ఆగస్ట్ 1న విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నవాబుపేట రైతుబజారు విద్యుత్ సబ్‌స్టేషన్, బోడిగాడితోట విద్యుత్‌ఫీడర్ పరిధిలోని మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరుటౌన్ విద్యుత్‌శాఖ ఈఈ సోమశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైపాడురోడ్డు విస్తరణ పనులు చేపట్టిన ప్రదేశాల్లో విద్యుత్ లైన్లను మారుస్తున్నందున ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. బోడిగాడితోట, వైకుంఠపురం, సత్యనారాయణపురం, జాకీర్‌హుస్సేన్‌నగర్, శ్రీనివాసనగర్, మైపాడురోడ్డు, పరిసర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగునని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెరువులో గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు రూరల్: సౌత్‌మోపూరు చెరువులో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. వీఆర్వోకు సమాచారం అందజేయగా నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు చెరువు వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించారు. మృతదేహం స్వభావం ఆధారంగా మూడ్రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నెల్లూరు రూరల్: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నవాలకులతోట దొరతోపు సంఘంలో చోటు చేసుకుంది. వివరాలు..దొరతోపు సంఘానికి చెందిన షేక్ జమాల్‌బాషాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఫయాజ్(18) సంతానం. ఫయాజ్ వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. అవివాహితుడైన ఫయాజ్ గత కొంతకాలంగా తన తల్లిదండ్రులు తరచూ గొడవలు పడుతున్నారని మనోవేదన చెందుతుండేవాడు. ఆదివారం రాత్రి కూడా తల్లిదండ్రులు గొడవపడి ఇంటి ఆవరణంలో నిద్రిస్తున్న సమయంలో ఫయాజ్ ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయాన్నే తండ్రి జమాల్‌బాషా ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకుని ఉన్న కుమారుడ్ని చూసి బోరున విలపించాడు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. అనంతరం మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సబ్సిడీపై విత్తనాల పంపిణీ

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు వివిధ రకాల విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలైన జనుములు, జీలుగలు 50 శాతం సబ్సిడీతో ఇస్తున్నామని చెప్పారు. రాగులు, కందుల మినీకిట్లను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు.

జెరూసలేం యాత్ర ప్రారంభం



జెరూసలేం యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: బుజబుజనెల్లూరు తల్పగిరి కాలనీ సమీపంలోని తెలుగు బాప్టిస్టు చర్చి నుంచి 34మంది క్రైస్తవులు జెరూసలేం యాత్రకు సోమవారం పయనమయ్యారు. నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి జెరూసలేం యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ఆధ్యాత్మిక యాత్రలకు తోడ్పాటును అందిస్తున్నారన్నారు. జెరూసలేం యాత్రకు వెళ్లే క్రైస్తవులకు రూ.3లక్షల లోపు ఆదాయం ఉంటే రూ.60వేలు, ఆపైన ఉంటే రూ.30వేలు చొప్పున అందజేస్తున్నారని తెలిపారు. జెరూసలేం యాత్రను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పది రోజుల పాటు సాగే యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని క్షేమంగా తిరిగి రావాలన్నారు. సీఎం వైఎస్ జగన్ క్షేమంగా ఉండాలని జెరూసలేంలో ప్రత్యేక ప్రార్థనలు చేయాలని యాత్రికులను కోరారు. అనంతరం యాంత్రికులకు వీసా, పాస్‌పోర్టు, విమాన టికెట్లను అందజేశారు. ఏపీ క్రిస్టియన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ శేఖర్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నిర్మలాదేవి,ఈడీ నారాయణ, స్థానిక చర్చి పెద్దలు జెరూసలేం యాత్రికులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



28/2 వార్డు సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు కారణమైన రోడ్ల ఆక్రమణలపై తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ వికాస్‌మర్మత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కార్పొరేషన్ అధికారులతో కలిసి జగనన్నకు చెబుదాం, స్పందన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలుత 28/2 న్యూమిలటరీ కాలనీ సచివాలయాన్ని పరిశీలించారు. అనంతరం నవాబుపేట ప్రాంతంలో జగనన్నకు చెబుదాం ఫిర్యాదుకు సంబంధించిన సమస్య క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మినీబైపాస్‌రోడ్డు, ఆత్మకూరు బస్టాండ్, రైల్వేస్టేషన్, స్టోన్‌హౌస్‌పేట, తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాలను ఆక్రమించి ఆటోలు, మినీవ్యాన్‌లు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండడాన్ని కమిషనర్ పరిశీలించారు. రోడ్డు ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకోవాలని డీసీపీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ విభాగాల అధికారులు, సచివాలయాల అమెనిటీస్, ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న సుధీర్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): వలంటీర్లకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నెల్లూరులో విలేకరులతో మాట్లాడారు. పవన్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకపోతే వలంటీర్ల ఆగ్రహానికి గురవుతావని హెచ్చరించారు. వలంటీర్లను కించపరిచేలా మాట్లాడడం దారుణమన్నారు. వారంతా జగనన్న ప్రభుత్వంలో పేదలకు సేవ చేస్తున్నట్లు చెప్పారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచారన్నారు. ఆ సమయంలో పవన్ కళ్యాణ్ ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. అన్ని రాష్ట్రాలు వలంటీర్ల వ్యవస్థను అభినందించి తమ దగ్గర ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు కూడా వలంటీర్లను ఇష్టానుసారం మాట్లాడాడని చెప్పారు. జగనన్న వలంటీర్లను మున్సిపల్ చైర్మన్లను చేశారన్నారు.

గుండెపోటుతో కూలీ మృతి

నెల్లూరు రూరల్: సౌత్‌మోపూరులో గుండెపోటుతో ఓ వ్యవసాయ కూలీ సోమవారం మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వేణు(28) కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజూ ధాన్యం బస్తాలు లోడ్ చేసే పనులకు వెళుతుంటాడు. సోమవారం రోజూలాగే జెడ్పీ హైస్కూల్ సమీపంలో లారీకి ధాన్యం బస్తాలు లోడ్ చేస్తుండగా ఒక్కసారిగా గుండెనొప్పితో కుప్పకూలాడు. తోటి కూలీలు ఏమైందని ప్రశ్నించగా గుండెల్లో నొప్పిగా ఉందని చెప్పాడు. అక్కడే ఉన్న ధాన్యం కొనుగోలుదారుడు తన బైక్‌పై వేణును ఎక్కించుకుని ఇంటి వద్దకు తీసుకెళుతుండగా మార్గం మధ్యలో అతడిపై వాలిపోయాడు. అనంతరం నెల్లూరులోని జీజీహెచ్‌కు అంబులెన్స్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లుగా నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. మృతుడికి భార్య, మూడు నెలల పాప ఉన్నారు. వేణు మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా వేణు మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

ఓటమి భయంతోనే డ్రామాలు



మాట్లాడుతున్న పాలకీర్తి రవి

నెల్లూరు రూరల్: రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేతిలో ఓటమి తప్పదని ఊహించి తన అనుచరులతో డ్రామాలు ఆడిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి అన్నారు. సోమవారం ఆయన వెంగళరావునగర్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కోటయిరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రోద్బలంతో నేస్తం ఫౌండేషన్ నిర్వాహకుడు ప్రవీణ్ సోషల్ మీడియాలో వైఎస్సార్‌సీపీ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. 38వ డివిజన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ దాసరి రాజేష్ తనను వైఎస్సార్‌సీపీలో చేరాలని ఒత్తిడి చేశారని, అందుకు విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి సైతం వత్తాసు పలుకుతూ తనను వేధింపులకు గురిచేస్తున్నారని ప్రవీణ్ ఆరోపించడం కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆడించిన డ్రామానేనన్నారు. మంచి వ్యక్తిత్వం కలిగిన రంగారెడ్డిపై విమర్శలు చేయడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. ప్రవీణ్ వంటి వ్యక్తులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించే అవసరం పార్టీకి ఏ మాత్రం లేదన్నారు. కోటంరెడ్డి సోదరులు ఎన్ని డ్రామాలు ఆడినా వచ్చే ఎన్నికల్లో ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఘన విజయంతో గెలుపొందడం ఖాయమన్నారు. వైఎస్సార్‌సీపీకి నమ్మకద్రోహం చేసిన కోటంరెడ్డికి ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు.